శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి

కరీంనగర్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవని పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి ఒక ప్రకటనలో హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా నియమ నిబంధనలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సంబంధిత ఏసీపీల నుంచి అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించకూడదని తెలిపారు. ఇతరులను గాయపరిచే వస్తువులు, మారణాయుధాలను ధరించి సంచరించవద్దని, రోడ్లు, ప్రజలకు ఉపయోగపడే ఇతర స్థలాల్లో జనాన్ని సమీకరించవద్దని పేర్కొన్నారు. కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో భద్రత కారణాల దృష్ట్యా పారాగ్లైడర్స్, రిమోట్ కంట్రోల్ డ్రోన్స్, రిమోట్ కంట్రోల్ మైక్రో లైట్ ఏయిర్ క్రాఫ్ట్‌ల వినియోగాన్ని నిషేధించినట్లు సీపీ తెలిపారు. అలాగే డీజే సౌండ్ వినియోగం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను ఈ నెల 31 వరకు పొడిగిస్తున్నామని పేర్కొన్నారు. వివిధ కార్యక్రమాల నిర్వహణకు మైక్ సెట్‌ల వినియోగం తప్పనిసరి అయితే సంబంధిత డివిజన్ ఏసీపీ అనుమతి పొందాలని సూచించారు. నిషేధాజ్ఞలు ఉల్లఘించే వారిపై ఐపీసీ 188, హైదరాబాద్ నగర పోలీసుచట్టం, ఫసలి నిబంధనలనుసరించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

సైన్స్‌తోనే మానవ అభివృద్ధి

విద్యార్థికి బహుమతి అందజేస్తున్న వీసీ ఉమేష్ కుమార్

కమాన్‌చౌరస్తా, మార్చి 4 : మానవ అభివృద్ధి సైన్స్‌తో ముడిపడి ఉన్నదని, ప్రతి ఒక్కరూ కొత్త ఆవిష్కరణలు చేయాలని శాతవాహన యూనివర్సిటీ వీసీ ఆచార్య ఉమేష్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం శాతవాహన విశ్వవిద్యాలయంలో సైన్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ జయంతి అధ్యక్షతన తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ హైదరాబాద్ సహకారంతో నిర్వహించిన నేషనల్ సైన్స్ డేకు ఉప కులపతి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మానవ అభివృద్ధి క్రమంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కృత్రిమ మేధస్సుతో నూతన ఆవిష్కరణల కోసం నిరంతరం శ్రమించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్స్ వైస్ ప్రెసిడెంట్ ఆచార్య సంజీవరెడ్డి, ఆచార్య జాస్తి రవికుమార్, ఆచార్య దిగంబర్ రావు, డాక్టర్ సాయిని కిరణ్.. సైన్స్ ప్రాముఖ్యతను వివరించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజన పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్, మార్చి 4: రాష్ట్రంలోని పలు గిరిజన విద్యాసంస్థల్లో 2025-26 విద్యాసంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశాల కోసం గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజనాభివృద్ధి శాఖ అధికారి నాగరాజు తెలిపారు. హైదరాబాద్ జిల్లాలోని బోయినపల్లిలో గల వాటర్ స్పోర్ట్స్ అకాడమీ, ఆదిలాబాద్ జిల్లాలోని జాతర్ల బాలుర మోడల్ స్పోర్ట్స్ పాఠశాల, కొత్తగూడెం జిల్లాలోని కిన్నెరసాని బాలుర, కాచనపల్లి బాలికలు, ఆసిఫాబాద్ జిల్లాలోని బాలికల పాఠశాలల్లో చదివేందుకు ఔత్సాహికులైన విద్యార్థినీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ ఏడాది ఆగస్టు 31 నాటికి 9 నుంచి 11 ఏళ్లలోపు వయసు కలిగి ఉన్న జిల్లాలోని విద్యార్థులు తమ దరఖాస్తును కలెక్టరేట్‌లోని గిరిజనాభివృద్ధి సంస్థ అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షల ఆధారంగా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 12 నుంచి 16 వరకు ఎంపిక ప్రక్రియ పూర్తిచేయనున్నట్లు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 8686451313 సెల్ నంబర్‌లో సంప్రదించాలని స్పష్టం చేశారు.

సైన్స్‌పై ప్రతి విద్యార్థి అవగాహన పెంచుకోవాలి

సాయిమానేరు పాఠశాలలో ప్రయోగాలను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

కమాన్‌చౌరస్తా/కొత్తపల్లి, మార్చి 4 : విద్యార్థులు సైన్స్‌పై పూర్తి అవగాహన పెంచుకోవాలని మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి సూచించారు. మంకమ్మతోటలోని సాయి మానేరు పాఠశాలలో మంగళవారం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ముందుగా అనంతరెడ్డి సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సైన్స్ నిత్య జీవితంలో ఒక భాగమని, సైన్స్ లేనిదే ఏదీ లేదని తెలిపారు. విద్యార్థులు అబ్దుల్ కలాం లాంటి శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకొని సైన్స్‌లో రాణించాలన్నారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు 200కు పైగా ప్రయోగాలు రూపొందించి ప్రదర్శించగా, విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా లైన్‌మెన్ దినోత్సవం

సప్తగిరి కాలనీ సబ్ స్టేషన్‌లో రక్షణ, భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఈ

ముకరంపుర, మార్చి 4: ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ కరీంనగర్ సర్కిల్లో మంగళవారం లైన్‌మెన్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కరీంనగర్ టౌన్ డివిజన్‌లోని టవర్ సర్కిల్, సప్తగిరి కాలనీ, హౌసింగ్ బోర్డు సెక్షన్ కార్యాలయాల్లో జరిగిన కార్యక్రమంలో ఎస్ఈ మేక రమేశ్ బాబు పాల్గొన్నారు. సంస్థలో క్షేత్ర స్థాయిలో పని చేసే జేఎల్ఎం, ఏఎల్ఎం, ఎల్ఎం, ఎల్ఐ ఎస్ ఎల్ ఐ, ఫోర్ మెన్, అన్ మ్యాన్డ్, ఆర్టిజన్ కార్మికులకు శుభాకాంక్షలు తెలియజేశారు. వారందరినీ విద్యుత్ యుద్ధ వీరులుగా అభివర్ణిస్తూ, సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డీఈ (టెక్నికల్) ఉపేందర్, డీఈ(ఆపరేషన్) జే రాజం, ఏడీఈలు లావణ్య, పంజాల శ్రీనివాస్ గౌడ్, ఏఈ మల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సహకార సంఘాలను నిర్వీర్యం చేయొద్దు

శంకరపట్నం, మార్చి 4: గొల్ల, కురుమలు ఆర్థికంగా, సామాజికంగా బలపడేందుకు తోడ్పడే సహకార సంఘాలను నిర్వీర్యం చేయొద్దని జీఎంపీఎస్ జిల్లా జిల్లా ప్రధాన కార్యదర్శి కాల్వ సురేశ్ యాదవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘం మండల గౌరవాధ్యక్షుడు గొర్ల కొమురయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మండలంలో 18 సొసైటీలు ఉండగా ఇప్పటి వరకు కేవలం 6 సంఘాలకు మాత్రమే ఎన్నికలు నిర్వహించడం సరికాదన్నారు. ఇప్పటికైనా ఎన్నికల నియమావళి మేరకు మిగిలిన సొసైటీలకు ఎన్నికలు నిర్వహించాలని కోరారు. అలాగే, ప్రభుత్వం మూగ జీవాలకు కావాల్సిన అన్ని మందులు, వ్యాక్సిన్లు వెటర్నరీ దవాఖానల్లో అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో చెర్ల తిరుపతి యాదవ్, జినుక రాజయ్య, కేశవేని ఐలయ్య, దొంగల తిరుపతి, గుండారపు అనిల్, కొత్తపల్లి అశోక్, గడ్డి సంపత్, చెన్నవేని తిరుపతి, చెన్నవేని వెంకన్న, ముక్కెర కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

బదిలీ వర్కర్ విధానాన్ని కొనసాగించాలి

కార్పొరేషన్, మార్చి 4: కరీంనగర్ నగరపాలక సంస్థలో పారిశుధ్య కార్మికుల విషయంలో బదిలీ వర్కర్ విధానం కొనసాగించాలని బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో కోరారు. చెత్తా చెదారం శుభ్రం చేయడం, చనిపోయిన జంతు కళేబరాలు తీసివేయడం, తీవ్ర దుర్వాసన వెలువడే పరిసరాల్లోనూ కార్మికులు పని చేస్తారని, దీని వల్ల వారు తరచూ అనారోగ్యం పాలవుతారని పేర్కొన్నారు. ఆయా కార్మికులు తిరిగి కోలుకునే వరకు వారి స్థానాల్లో ఆ కుటుంబానికి చెందిన మరో వ్యక్తి పని చేస్తున్నారని, ఈ విధానాన్ని ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వాలు కొనసాగిస్తున్నాయని తెలిపారు. ఇది పెద్ద కుంభకోణమేమీ కాదని, కేవలం కార్మికుల ఆరోగ్య పరిస్థితికి సంబంధించిన విషయమని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు మానవతా దృక్పథంతో అర్థం చేసుకొని ఈ పద్ధతిని కొనసాగించాలని కోరారు.

వీధి దీపాల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

- కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్
- అధికారులు, ఈ ఎస్ ఎల్ సంస్థ సిబ్బందితో సమీక్ష

వాటర్ సప్లయ్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు

కార్పొరేషన్, మార్చి 4 : నగర వ్యాప్తంగా వీధి దీపాల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం వీధి దీపాల నిర్వహణ విభాగం అధికారులు, సిబ్బంది, ఈ ఎస్ ఎల్ సంస్థ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగర వీధి దీపాల నిర్వహణపై ప్రజల నుంచి చాలా ఫిర్యాదులు వస్తున్నాయని.. పలు డివిజన్లలో చాలా వరకు లైట్లు వెలగడం లేదన్నారు. ప్రతిరోజూ సిబ్బంది సాయంత్రం డివిజన్లలో పర్యటించి ఎక్కడెక్కడ లైట్లు వెలగడం లేదో గుర్తించి.. వాటిని రీ ప్లేస్ చేయాలన్నారు. స్టాక్ రిజిస్టర్ పాటించి.. వెలగని వీధి దీపాల స్థానంలో కొత్త బల్బులను అమర్చాలన్నారు. సీసీఎంఎస్ బాక్స్‌లు, పోల్ నంబర్ వారీగా వివరాలు నమోదు చేయాలన్నారు. నగరంలోని వెలగని లైట్ల వివరాల రిపోర్ట్ అందించాలన్నారు. ఇన్ని రోజులుగా లెట్లు వెలగకుండ ఉంటే సిబ్బంది ఏం విధులు

మాట్లాడుతున్న కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

నిర్వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీధి దీపాల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈఎస్ ఎల్ సంస్థ సిబ్బంది వీధి దీపాల నిర్వహణ సక్రమంగా చేపట్టకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై స్మార్ట్‌సిటీ లైట్లతో పాటు నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన లైట్లు ప్రతి రోజూ వెలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఈఈ యాదగిరి, డీఈ అయూబ్ ఖాన్, ఏఈ ఘపూర్, ఈఎస్ఎల్, నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

మానకొండూర్: పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్

కమాన్‌చౌరస్తా/మానకొండూర్/మానకొండూర్ రూరల్/చిగురుమామిడి, మార్చి 4 : జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మొదటి సంవత్సరం పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 17,799 మంది విద్యార్థులు హాజరు కానుండగా, ఇందుకోసం 58 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్ష ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుండగా, ఐదు నిమిషాలు ఆలస్యమైనా కేంద్రంలోకి అనుమతిస్తామని అధికారులు తెలిపారు. మానకొండూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రం, దేవంపల్లి గురుకుల పాఠశాల, చిగురుమామిడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ రాజేశ్వర్‌రావు, గోలి జగన్నాథం, చిగురుమామిడి కళాశాల పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ జనార్దన్ వెల్లడించారు.

సమూలంగా డివిజన్ల మార్పులు

- పునర్ విభజనతో మారనున్న సరిహద్దులు
- ఇప్పటికే ప్రభుత్వానికి అధికారుల నివేదిక?
- బల్దియాలో జోరుగా చర్చ

ప్రతి డివిజన్‌లో 5వేల మంది ఓటర్లు

కార్పొరేషన్, మార్చి 4: కరీంనగర్ నగరపాలక సంస్థలో డివిజన్ల పునర్ విభజన అంశం ఇప్పుడు అందరిలోనూ ఆసక్తిని పెంచుతున్నది. ఓ వైపు మున్సిపల్ అధికారులు ఇప్పటికే 66 డివిజన్లకు సంబంధించి ఓటర్లు, ఇళ్లను విభజించి ప్రభుత్వానికి ఓ నివేదిక ఇచ్చారన్న ప్రచారం నగరపాలక సంస్థలో జోరుగా సాగుతున్నది. అయితే ఇప్పటి వరకు అధికారికంగా మున్సిపల్ శాఖ నుంచి డివిజన్ల పునర్ విభజనపై ఎలాంటి సమాచారం లేదు. కానీ, కరీంనగర్‌లోని 66 డివిజన్లకు సంబంధించి మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పునర్ విభజన ప్రక్రియను పూర్తి చేసినట్లు జోరుగా గుసగుసలు వినిపిస్తున్నాయి. దీంతో ఏయే డివిజన్ల స్వరూపం ఏ విధంగా మారిందన్న విషయంలో నాయకుల మధ్య జోరుగా చర్చలు సాగుతున్నాయి. ఇదే విషయంలో కాంగ్రెస్‌కు చెందిన మాజీ కార్పొరేటర్లు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసినట్లుగా తెలుస్తున్నది. తమ డివిజన్ల పరిస్థితిపై విన్నవించుకున్నట్లు సమాచారం.

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కొత్తపల్లి మున్సిపాలిటీతో పాటు, మల్కాపూర్, చింతకుంట, బొమ్మకల్, దుర్శేడ్, గోపాల్‌పూర్ గ్రామాలను నగరపాలక సంస్థలో విలీనం చేయడంతో పాటు డివిజన్ల సంఖ్యను కూడా 66కు పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. దీంతో నగరంలో డివిజన్ల పునర్ విభజన తప్పని పరిస్థితి నెలకున్నది. దీనిని దృష్టిలో పెట్టుకొనే నగరపాలక సంస్థ అధికారులు 66 డివిజన్లకు సంబంధించి విభజన ప్రక్రియ పూర్తి చేశారని తెలుస్తున్నది. ఈ విషయంలో గత కొన్ని రోజులుగా బిల్ కలెక్టర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులతో ఉన్నతాధికారులు పలు విడుతలుగా చర్చలు జరిపి, మ్యాపింగ్‌లను పరిశీలించి డివిజన్ల పునర్ విభజనకు సంబంధించి ఓ రూపు తీసుకువచ్చినట్లు సమాచారం. గతంలోని డివిజన్ల స్వరూపాన్ని తీసుకొని హైదరాబాద్‌లోని మున్సిపల్ కార్యాలయంలో ఈ ప్రక్రియ చేపట్టినట్లుగా తెలుస్తున్నది.

అంతర్‌రాష్ట్ర దొంగ అరెస్ట్

- తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా చోరీలు
- పట్టుకున్న కొత్తపల్లి పోలీసులు

కొత్తపల్లి, మార్చి 4 : వరుస దొంగతనాలకు పాల్పడుతున్న మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అంతర్‌రాష్ట్ర దొంగను కొత్తపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ట్రైనీ ఐపీఎస్ అధికారి వసుంధర యాదవ్, కరీంనగర్ రూరల్ ఏసీపీ శుభం నగ్రాలే వెల్లడించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని దార్ జిల్లా తండా పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోర్ గ్రామానికి చెందిన ప్రదీప్ (30) మరో ఎనిమిది మంది ముఠా సభ్యులు సంవత్సరకాలం నుంచి కరీంనగర్ జిల్లాలో తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకొని అర్ధరాత్రి వేళల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారని అధికారులు తెలిపారు. ఈ ముఠా సభ్యులు మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్ నుంచి ట్రావెల్స్ బస్సుల ద్వారా నిజామాబాద్‌కు, అక్కడి నుంచి బస్సుల ద్వారా కరీంనగర్ బస్టాండ్‌కు చేరుకొని కాలినడకన సంచరిస్తూ ఉదయం నుంచి సాయంత్రం వరకు రెక్కీ నిర్వహిస్తారని చెప్పారు. దొంగతానికి ఎంచుకున్న ఇళ్ల సమీప ప్రాంతంలోని పొదల్లోకి చీకటి పడే వేళల్లో చేరుకుని రాత్రి 12 గంటల దాటిన తర్వాత బయటకు వచ్చి ఇళ్ల తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడినట్లు వివరించారు. ఇటీవల కరీంనగర్ పరిధిలో దొంగతనాల నియంత్రణకు కరీంనగర్ రూరల్ ఏసీపీ సీసీఎస్, కొత్తపల్లి పోలీసులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయగా, ఈ బృందం మధ్యప్రదేశ్ రాష్ట్రానికి వెళ్లి దొంగలను గుర్తించినట్లు తెలిపారు. ఈ నెల 2న ముఠాలోని ప్రధాన నిందితుడు ప్రదీప్‌ను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ ముఠా సభ్యులు కరీంనగర్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుంటూరుపల్లి, కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్కాపూర్, చింతకుంట ప్రాంతంలో నాలుగు ఇండ్లల్లో దొంగతనాలకు పాల్పడ్డారని తెలిపారు. నిందితుడి నుంచి ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అతడిని పట్టుకోవడంలో కీలకపాత్ర పోషించిన కొత్తపల్లి ఎస్ఐ సాంబమూర్తి, కానిస్టేబుళ్లు షరీఫ్, శ్రీనాథ్, ఖదీర్‌ను కరీంనగర్ రూరల్ ఏసీపీ శుభం నగ్రాలే, ట్రైనీ ఐపీఎస్ అధికారి వసుంధర యాదవ్ అభినందించారు.

అంతర్‌రాష్ట్ర దొంగ వివరాలను వెల్లడిస్తున్న ట్రైనీ ఐపీఎస్, కరీంనగర్ రూరల్ ఏసీపీ

యువకుడి అదృశ్యం

బీ చిరంజీవి (ఫైల్)

చిగురుమామిడి, మార్చి 4: మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన బింగి చిరంజీవి(30) అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేశ్ తెలిపారు. శనివారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో వ్యవసాయ బావి దగ్గరికి వెళ్తున్నట్లు చెప్పి ఇంటి నుంచి బయలు దేరిన అతడు, తిరిగి రాలేదు. తల్లి బింగి గౌరవ్వ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఎవరికైనా బింగి చిరంజీవి ఆచూకీ తెలిస్తే తన సెల్ నంబరు 8712670772కు సమాచారం ఇవ్వాలని కోరారు. చిరంజీవి కరీంనగర్, హుస్నాబాద్, చిగురుమామిడి మండలంలోని పలు గ్రామాల్లో ఎలక్ట్రీషన్‌గా పని చేస్తున్నాడని తెలిపారు.

ఘనంగా మోడల్‌స్కూల్ వార్షికోత్సవం

సైదాపూర్, మార్చి 4: సోమారం మోడల్ స్కూల్‌లో మంగళవారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఆత్మహత్య

మానకొండూర్ రూరల్, మార్చి 4: లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన కొమ్మగళ్ల పవన్ కళ్యాణ్ (22) సోమవారం రాత్రి ఇంట్లో చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని, ఈ క్రమంలో బలవన్మరణం చెందినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మానకొండూర్ సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

గీత కార్మికుడికి తీవ్రగాయాలు

శంకరపట్నం, మార్చి 4: తాడికల్ గ్రామంలో తాడిచెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు జారి పడడంతో గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. మొలంగూర్ గ్రామానికి చెందిన గీత కార్మికుడు మొలుగూరి రఘుపతి మంగళవారం మధ్యాహ్నం ఎస్సారెస్పీ క్యాంపు సమీపంలోని ఓ తాటిచెట్టు ఎక్కి కల్లు గీసి క్రమంలో మోపు పట్టుతప్పి ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన అతడిని స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ సిబ్బంది రఘుపతికి ప్రథమ చికిత్స అందిస్తూ హుజూరాబాద్ దవాఖానకు తరలించారు.

'సమయపాలన పాటించని సిబ్బంది'

గన్నేరువరం, మార్చి 4: మండల కేంద్రంలోని ఆయుర్వేదిక్ వైద్యశాల సిబ్బంది సమయపాలన పాటించడం లేదని, వైద్యశాల ఎప్పుడూ తాళం వేసే ఉంటున్నదని రాష్ట్ర యువజన నాయకుడు సంపతి ఉదయ్ కుమార్ మంగళవారం ఆయుర్వేద వైద్యశాల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆయుర్వేద వైద్య చికిత్స పొందుతున్న వృద్ధులు, సిబ్బంది లేక దవాఖాన మూసి ఉండడంతో ఇబ్బంది పడాల్సి వస్తున్నదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమయపాలన పాటించని వైద్య సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు వైద్యశాలకు డాక్టర్, ఇతర సిబ్బందిని సమకూర్చాలని డిమాండ్ చేశారు.

వేడుకగా వీడ్కోలు సమావేశం

చిగురుమామిడి, మార్చి 4: బొమ్మనపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులతో తమకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. 10 జీపీఏ సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణరావు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ తోట శ్రీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయంలో వాటర్‌ప్లాంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే

తిమ్మాపూర్, మార్చి 4: మండలంలోని నల్లగొండ శ్రీ సీతారామ లక్ష్మీ నృసింహాస్వామి ఆలయంలో రామకృష్ణకాలనీ గ్రామానికి చెందిన చైత్ర అక్వాటెక్నాలజీ నిర్వాహకుడు గొరిటా సతీశ్ ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. ఆలయానికి వచ్చే భక్తులకు నీటి ఇబ్బందులు లేకుండా రూ.లక్షాయాభై వేల విలువ చేసే వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేసిన సతీశ్‌ను ఎమ్మెల్యే కవ్వంపల్లి అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి

శంకరపట్నం, మార్చి 4: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని డిస్ట్రిక్ట్ పబ్లిక్ హెల్త్ నర్స్ (డీపీహెచ్ఎన్) విమల సూచించారు. మంగళవారం ఆమె మండల కేంద్రంలోని పీహెచ్‌సీని సందర్శించి ఆశ కార్యకర్తలు, సిబ్బందితో సమావేశమయ్యారు. సాధారణ ప్రసవాలపై అవగాహన కల్పించి, ప్రోత్సహించాలని, బీపీ, షుగర్ పేషెంట్ల పెండింగ్ డేటాను వెంటనే అప్‌డేట్ చేయించాలని చెప్పారు. వేసవిలో ఉపాధిహామీ కూలీలకు వడదెబ్బపై అవగాహన కల్పిస్తూ, ఉదయం, సాయంత్రం ఓఆర్ఎస్ ద్రావణాన్ని అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్‌కుమార్, ఏఎన్ఎంలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అధికంగా మద్యం సేవించడంతో వలస కూలీ మృతి

వీణవంక, మార్చి 4: మండల కేంద్రంలో ఇటీవల మహబూబ్‌నగర్ జిల్లా కురవి మండలం, గుండ్రాతిమడుగు గ్రామానికి చెందిన షేక్ నాసర్ (41) అనే వలస కూలీ మృతిచెందిన విషయం తెలిసిందే. కాగా, మోతాదుకు మించి మద్యం సేవించడంతోనే అతడు చనిపోయినట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు. మండల కేంద్రంలో ఓ ఇంట్లో కిరాయికి ఉంటూ జీవనోపాధి కోసం కరీంనగర్-జమ్మికుంట హైవే రోడ్డు పనులు చేస్తున్న షేక్ నాసర్, ఈనెల 2న తన పని ముగించుకొని ఎక్కువ మోతాదులో మద్యం సేవించి కిరాయికి ఉంటున్న బిల్డింగ్‌పై నిద్రపోయాడు. తాగిన మత్తులో 3వ తేదీన రోజంతా ఎండలో పడుకొని ఉండడం వల్ల శరీరం డీహైడ్రేషన్ అయి, ఎండదెబ్బ తగిలి మృతిచెందినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

గ్రామంలో దోమల బెడద నివారించాలి

కార్పొరేషన్, మార్చి 4: కరీంనగర్ నగరపాలక సంస్థలోని గోపాల్‌పూర్ గ్రామంలో పెరుగుతున్న దోమల బెడదను నివారించేందుకు వెంటనే ఫాగింగ్ చేపట్టాలని మాజీ సర్పంచ్ ఊరటి మంజుల- మల్లారెడ్డి మంగళవారం నగర కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌కు వినతిపత్రం అందించారు. దోమల బెడద వల్ల గ్రామంలోని ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని పేర్కొన్నారు. అలాగే, తమ విలీన గ్రామంలోని ఇంటి నంబర్లు ఆన్‌లైన్ కాకపోవడం వల్ల పన్నుల చెల్లింపుల్లో ఇబ్బందులు వస్తున్నాయన్నారు. వీటిపై కూడా దృష్టి పెట్టి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

వృద్ధాశ్రమంలో అల్పాహార వితరణ

కరీంనగర్ రూరల్, మార్చి 4: లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా 320జీ లయన్స్ క్లబ్ ఆఫ్ బొమ్మకల్ ఆధ్వర్యంలో మంగళవారం కరీంనగర్ హౌసింగ్‌బోర్డు కాలనీలోని వీరబ్రహ్మేంద్ర అనాథ వృద్ధాశ్రమంలో అల్పాహార వితరణ చేశారు. చింతల శివాని పుట్టిన రోజు సందర్భంగా ఈ సేవా కార్యక్రమం చేపట్టారు. జోనల్ లయన్స్ క్లబ్ చైర్‌పర్సన్ చింతల కిషన్‌పటేల్, అధ్యక్షుడు కామి